

హత్యాచారాలపై ఆగ్రహ జ్వాల

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఏలూరులో విద్యార్థినులు భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 8లో ▸



తస్మాత్ జాగ్రత్త

పొలాల్లో పురుగు మందుల పిచికారీ విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



పంచలోహ విగ్రహం చోరీ

ఆగిరిపల్లిలోని వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పంచలోహ విగ్రహం మంగళవారం చోరీకి గురైంది. 8లో ▸

న్యూస్‌రీల్

పని సర్దుబాటులో అసంబద్ధాలను తొలగించాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పని సర్దుబాటు ప్రక్రియలో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహంకు మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ.రామారావు, బీ.రెడ్డిదొర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హత లేని ఎస్‌జీటీల పని సర్దుబాటులో భాగంగా సబ్జెక్టు బోధించడానికి ఉన్నత పాఠశాలకు కేటాయించడం సరికాదన్నారు. అదే విధంగా ఉన్నత పాఠశాలల్లో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లను కూడా లెక్కించి మిగులు ఉపాధ్యాయులను గుర్తించడం సరికాదన్నారు. ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఈ విషయాలపై విద్యాశాఖాధికారి సానుకూలంగా స్పందించారని, ఈ విషయాలను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పోలవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీ రమణ, పీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎఫ్ చందాదారుల బ్యాలెన్స్ షీట్‌ల అందజేత

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లోని జెడ్పీ భవిష్య నిధి చందాదారుల 2020–24 ఆర్థిక సంవత్సరాలకు చెందిన జమ, ఖర్చుల బ్యాలెన్స్ షీట్‌లను డీడీవో కార్యాలయాలకు పంపించినట్లు జెడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 2018–19. 2019–20 ఆర్థిక సంవత్సరాల రివైజ్డ్ బ్యాలెన్స్ షీట్‌లను సైతం పంపించామన్నారు. బ్యాలెన్స్ షీట్‌లు అందని చందాదారులు హెల్ప్‌డెస్క్ ద్వారా సమాచారం పొందవచ్చని, చందాదారులందరూ గమనించి బ్యాలెన్స్‌షీట్‌లపై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 31వ తేదీ నాటికి సంబంధిత కార్యాలయ డీడీవోల ద్వారా తెలియజేయాలని సూచించారు.

పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన ప్రజాప్రతినిధులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రజా ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు ప్రాంతంలో పనులను పరిశీలించి, పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారుల నుంచి వీరు తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులు పరిశీలించిన వారిలో ఎంపీ ఎస్‌కే ముబిబుల్లా ఖాన్, మాజీ మంత్రులు దేబీ ప్రసాద్ మిశ్రా, సబ్యసాచి నాయక్, మాజీ ఎంపీలు ప్రదీప్ మాజీ, వస్కర్‌రావు, రిటైర్డ్ ఈఆర్‌లు రమేష్ చంద్ర త్రిపాఠి, కులమణి దాస్, ఎమినెంట్ సోషల్‌వర్కర్ భృగు బక్షిపత్ర ఉన్నారు.

రేపు అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో వ్యాపారం చేయాలనుకునే ఔత్సాహిక వ్యాపారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఎస్ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని తమ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సదస్సు జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ద్వారకాతిరుమల, కామవరపుకోట, కొయ్యలగూడెం, కలిదిండి, భీమవరం (స్టాఫ్ క్వార్టర్ల స్థలం), ఆకివీడు, మార్టేరు, తాడేపల్లిగూడెం బస్‌స్టేషన్లలో ఉన్న ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజుకి ఇచ్చే నిమిత్తం పిలిచిన టెండర్ ప్రకటనపై ఈ సదస్సులో అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ ఈఈ, డీఈఈల బదిలీ జాబితా సిద్ధం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బదిలీల మార్గదర్శకాల మేరకు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో తప్పనిసరిగా బదిలీలు కావాల్సిన అధికారుల జాబితా సిద్ధం చేశారు. వివిధ స్థాయి ఉద్యోగుల జాబితాలను ఇప్పటికే ప్రకటించగా తాజాగా మంగళవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల జాబితా ప్రకటించారు. ఈ జాబితాలో ఏలూరులో ఈఈ (టెక్నికల్)గా పనిచేస్తున్న ఎం.ఝాన్సీ, అలాగే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల జాబితాలో ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 8 మంది పేర్లు ఉన్నాయి.



కఠినమైన శిక్షలు విధించాలి



ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లవి కూడా ప్రాణాలే. డాక్టర్లకే రక్షణ లేకపోతే విధులు నిర్వహించలేని పరిస్థితులు తలెత్తుతాయి. డాక్టర్లకు సమగ్ర రక్షణ కల్పించాలి. ఇందుకోసం కఠినమైన చట్టాలు రూపొందించి శిక్షలు అమలు చేయాలి. ముఖ్యంగా మహిళ వైద్యుల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు **తీసుకోవాలి.**

– డాక్టర్ కరీముల్లా, వైద్యాధికారి, రమణక్కపేట పీహెచ్‌సీ ముసునూరు మండలం

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఉదంతం తీవ్రంగా కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మన రాష్ట్రంలో మహిళా వైద్యుల భద్రత కోసం ఆస్పత్రి వద్ద పోలీసుల రక్షణతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాలి. డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్ రూములను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ **యాక్టును వెంటనే అమలు చేయాలి. మహిళా వైద్య సిబ్బందికి ధైర్యాన్ని కల్పించాలి**

– జి.దయామణి, వైద్యురాలు, తుందుర్రు పీహెచ్‌సీ

గౌరవం మరుగు

కూటమి ప్రభుత్వం తీరుతో తమ గౌరవం కనుమరుగవుతోందని కొత్తగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లలో ఆవేదన వ్యక్తమవుతోంది. వారంలో రెండు రోజులు ఎస్ఎంసీ చైర్మన్లు, మరో రెండు రోజులు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలను తీయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులతో ఖిన్నులవుతున్నారు. అలాగే రోజులో నాలుగుసార్లు మరుగుదొడ్లను పరిశీలించాలని హెచ్ఎంలకు ఆదేశాలు అందడం గమనార్హం.

- ఎస్ఎంసీ చైర్మన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లను చిన్నబుచ్చేలా ఉత్తర్వులు
- వారంలో రెండు రోజులు మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలు
- ప్రతిరోజూ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధులు హెచ్ఎంలకు..
- కొద్ది భారం తీసి, మోయలేని భారం మోపిన కూటమి ప్రభుత్వం
- ఆయా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నా పట్టించుకోని సర్కారు



శనివారపుపేట ఎంపీ స్కూల్‌లో మరుగుదొడ్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలల్లో విద్యా బోధనపై పర్యవేక్షణ, మధ్యాహ్న **భోజన నిర్వహణపై** పర్యవేక్షణలతో పాటు పాఠశా**ల అభివృద్ధికి కృషి** చేసే విధంగా ఆయా పను**ల్లో భాగస్వాములను** చేయాలని గత ప్రభుత్వం **పేరెంట్స్ కమిటీలను** ఏర్పాటు చేసింది. ఆయా **కమిటీల ప్రతినిధులు** పాఠశాలల్లో తమ ముద్ర వే**యడానికి విశేషంగా కృ**షి చేసిన సందర్భాలూ **ఉన్నాయి. కూటమి** ప్రభుత్వం వచ్చిన తరువాత **పేరెంట్స్ కమిటీని** స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ **(ఎస్ఎంసీ)గా పేరు** మార్చి ఇటీవల ఎన్నికలు నిర్**వహించింది. ఈ ఎన్ని**కల్లో కూటమి పార్టీల సానుభూతిపరులే చైర్మన్లుగా ఉండేలా ఎమ్మెల్యేలు గట్టిగానే ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. అలా చైర్మన్లు అయిన వారు పాఠశాలలపై కర్రపెత్తనం చేయడానికి సిద్ధమైపోయారు కూడా. అయితే పేరుకు గొప్పగా చైర్మన్ పదవే కానీ చేయాల్సింది కర్రపెత్తనం కాదు మరుగుదొడ్ల ఫొటోలు తీసే 'కీలక' బాధ్యత అని కూటమి ప్రభుత్వం తాజాగా, చావుకబురు చల్లగా చెప్పింది.

వెల్ఫేర్ అసిస్టెంట్లకూ ఇదే దుస్థితి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక మందికి విలేజ్, వార్డు సెక్రటరీలుగా ఉద్యోగాలు కల్పించారు. వీరిలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలు ఒకరు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తదితర పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చేయడం, మధ్యాహ్న భోజన పథకం వివరాలు అప్‌లోడ్ వంటి గౌరవప్రదమైన పనులనే అప్పగించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీరికి పెన్షన్ల పంపిణీ, అన్న క్యాంటీన్లలో టోకెన్ల అమ్మకం తదితర పనులు అప్పజెప్పింది. ఇప్పుడు వారి హోదాను మరింత దిగజార్చి మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతను అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వారంలో రెండు రోజులు విధులు

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పట్టణాల్లో, నగరాల్లో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, గ్రామాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సోమ, గురువారాల్లో తమ పరిధిలోని పాఠశాలలకు వెళ్లి అక్కడ మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అలాగే ఎస్ఎంసీ చైర్మన్లు బుధవారం, శుక్రవారం మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో **అప్‌లోడ్ చేయాలి.** అలాగే పాఠశాలల హెచ్ఎంలు **ప్రతి రోజూ ఉదయం,** ఇంటర్వెల్ సమయంలో, **మధ్యాహ్న భోజన విరా**మం ముగిసిన తరువాత, **తిరిగి సాయంత్రం మరు**గుదొడ్లను పరిశీలించాలని **ప్రభుత్వం ఆదేశించింది.** అంతేకాక ఐఎంఎంఎస్ **యాప్‌లో సుమారు 15** ఖాళీలు పూరించి అప్‌లోడ్ **చేయాల్సి ఉంది. నిత్యం** ఎంత పని ఒత్తిడి ఉన్నా ఈ **విధులు తప్పక నిర్వర్తిం**చాలని ప్రభుత్వం ఉత్త**ర్వుల్లో పేర్కొంది.**

రసాయనాలు, పరికరాలు ఏవీ?

పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశీలించే విధులు కేటాయించిన కూటమి ప్రభుత్వం మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి వినియోగించే బ్రష్‌లు, చీపుర్లు, యాసిడ్‌లు, ఫినాయిల్, డెటాల్ తదితర రసాయనాలను మాత్రం సరఫరా చేయకపోవడం గమనార్హం. పాఠశాలలు పునఃప్రారంభించి రెండున్నెర నెలలు దాటినా ఇప్పటి వరకూ వాటి ఊసెత్తకుండా మరుగుదొడ్లు శుభ్రం చేయాలని ఎలా ఆదేశిస్తారని అటు ఉపాధ్యాయ వర్గాలు, ఇటు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

కూటమి నేతల యూటర్న్

గత ప్రభుత్వం పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని అందుకు ప్రధానోపాధ్యాయును బాధ్యులను చేసి మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఇది కేవలం ఒక్క నిమిషం పనే అయినా ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిని ఆసరాగా చేసుకుని కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులకు ఈ సమస్య నుంచి విముక్తి కల్పిస్తామని ప్రచారం ఊదరగొట్టి వారిని ఆకర్షించింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత యూ టర్న్ తీసుకోవడంతో ఉపాధ్యాయ వర్గాలకు పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టయింది.

ఉద్యోగుల పరిస్థితి దయనీయం



ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల పరిస్థితి రోజువారీ కూలీలకన్నా దయనీయంగా ఉంది. ఎంతో ఉన్నతమైన చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని చివరికి మరుగుదొడ్ల ఫొటోలు తీయడానికి వినియోగించుకోవాలనుకునే నిర్ణయం దారుణం. సచివాలయ ఉద్యోగుల మనోభావాలు, మానసిక స్థైర్యం దెబ్బతీసే నిర్ణయమిది.

– జీవీఎస్ శ్రీనివాస్, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రీజనల్ కోఆర్డినేటర్.

ప్రభుత్వం పునరాలోచించాలి



ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు మరుగుదొడ్ల బాధ తొలగిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఎన్నో బాధ్యతలు ఉన్నాయి. ఇటువంటి మరుగుదొడ్ల యాప్‌లో వివరాలు నమోదు చేయడం వంటి విధులు వారికి మరింత భారమౌతాయి. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– జీ.ప్రకాశరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయులపైనే ఒత్తిడి అధికం



మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఎస్ఎంసీ చైర్మన్లకు అప్పగించినా వారు వివిధ కారణాలతో ఫొటోలు తీయలేకపోతే ఆ బాధ్యత తిరిగి ప్రధానోపాధ్యాయునిపైనో, ఉపాధ్యాయుల పైనో పడుతుంది. ఇది గతంలో కంటే అధికభారంగా పరిణమిస్తోంది. దీనివల్ల ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి అధికమౌతోంది.

– జీ. మోహన్ రావు, ఏపీటీఎఫ్ 1938 ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యావంతులకు ఇచ్చే గౌరవమిదేనా?



డిగ్రీలు, పీజీలు, బీఈడీలు చదివిన ఉన్నత విద్యావంతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవమిదేనా. మరుగుదొడ్ల పారిశుధ్యంపై అంత చిత్తశుద్ధి ఉంటే దాని కోసం ప్రభుత్వం వేరే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. మరుగుదొడ్లను శుభ్రం చేసే పరికరాలూ, రసాయనాలు ఇవ్వకుండా పారిశుధ్యాన్ని పర్యవేక్షించడం ఎలా సాధ్యం. వెల్ఫేర్ అసిస్టెంట్‌ల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని విధుల నుంచి మినహాయించాలి.

– గడ్డం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

శ్రీవారి క్షేత్రంలో కృష్ణాష్టమి శోభ



క్షేత్రంలో శ్రీకృష్ణునికి హారతిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. కొండపైన గోసంరక్షణశాలలో, అలాగే ఆలయ తూర్పు ప్రాంతంలోని సప్తగోకులంలో పెద్ద ఎత్తున భక్తులు గోవులకు పూజలు నిర్వహించారు. అనంతరం వాటికి దాణాను అందించారు. ఈ సందర్భంగా సప్తగోకులంలో కొలువైన శ్రీకృష్ణుడినికి పురోహితులు పూజాదికాలను జరిపి, హారతులిచ్చారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో రద్దయిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు బుధవారం నుంచి యథావిధిగా జరుగుతాయని, భక్తులు గమనించాలని దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు సూచించారు.

నేడు క్షేత్రంలో ఉట్ల పండుగ

శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు క్షేత్రంలో ఉట్ల పండుగను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో ఉట్ల పండుగను వైభవంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అందులో భాగంగా ఉభయ దేవేరులతో శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతారని, యావన్మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఈఓ కోరారు.

రేపు గిరిజన గ్రీవెన్స్ డే

ఏలూరు (మెట్రో): జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ప్రతి నెలా నాలుగో గురువారం గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి నిర్ణయం తీసుకున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ పి. ధాత్రిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఆర్‌పురం ఐటీడీఏలో గురువారం ఉదయం 10.30 గంటలకు జరిగే గ్రీవెన్స్ డేలో ఏజెన్సీ ప్రాంత ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. దీనిని ఏజెన్సీ మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గోతులు పూడ్చివేత



బెయిలీ బ్రిడ్జి వద్ద గోతులను పూడ్చిన దృశ్యం

సాక్షి స్పందన

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా గుండుగొలను బెయిలీ వంతెన వద్ద గోతులతో నిండిన రోడ్డును ప్రజా విరాళాలతో పూడ్చారు. 'ఇంతింతై.. గోతులింతై' అనే శీర్షికన ఈనెల 26వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై గ్రామస్తులు, దాతలు స్పందించారు. మెటల్ డస్ట్‌ను గోతుల్లో పోసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో రాకపోకలకు అనువుగా ఉండటంతో వాహనచోదకులు, విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. దాతలను గ్రామస్తులు అభినందించారు. అయితే పూర్తి స్థాయిలో గోతులను పూడ్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): జిల్లాలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపడాలని, ఆదిశగా గ్రామ పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా చాట్రాయి, ఉంగుటూరు, నూజివీడు, బుట్టాయిగూడెం మండలాల్లో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని పంచాయితీ సిబ్బంది వాటర్ టెస్టింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్ వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆగస్టు 30న వన మహోత్సవం

జిల్లాలో ఆగస్టు 30 తేదీన వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ప్రతి గ్రామంలో 200 మొక్కలు నాటేలా ఒక్కరోజులో లక్ష ప్లాంటేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏలూరు జిల్లాలోని 9 నర్సరీల నుంచి లక్ష మొక్కలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం గృహ నిర్మాణ శాఖపై సమీక్షిస్తూ మండలాల్లో గృహ నిర్మాణాల్లో వేగం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై పురోగతి లేకపోతే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటరు నమోదుపై.. జిల్లాలో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కలెక్టర్ సమీక్షించారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలు సర్వే చేయాలన్నారు. ఓటరు నమోదు, చిరునామా మార్పు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డులో ప్రస్తుత ఫొటో మార్పు, జాబితాలో పేరు తొలగింపు, అంశాలపై అవగాహన కలిగించాలని ఆదేశించారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

ఏలూరు (మెట్రో): పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో సిబ్బంది బదిలీలకు సంబంధించి ఇప్పటికే సుమారు 600 దరఖాస్తులు వచ్చాయని డీపీఓ తెలిపారు. అభ్యర్థుల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్ చేశామన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న లారీలు

టాస్క్‌ఫోర్స్: ఉచిత ఇసుక పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా చేపడతున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఉట్టి నీటిమూటలేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, వింజరం గ్రామాల్లో ఇసుక నిల్వలను ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీకి కేటాయించింది. ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభించిన తరువాత అధికార పార్టీ నాయకులు కొంతమంది అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ఇసుకను లారీలలో తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలించిన విషయం వెలుగుచూసింది. ఈ విషయం బహిర్గతం కావడం పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు విచారణ పేరుతో నానాహడావిడి చేసి అసలు బాధ్యులెవరన్న విషయం తేల్చకుండా వాహనాలపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఉచిత ఇసుక పంపిణీ నిలిపివేశారు. మళ్లీ ఈ నెల 19న ఉచిత ఇసుక పంపిణీని అధికారులు ప్రారంభించారు. ఈసారి ఇసుక తరలింపులో ఎటువంటి అవకతవకలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్టు అధికారులు ప్రకటనలు చేశారు. అంతా సవ్యంగా సాగుతుందని అనిపించినా దీనిలో అవకతవకలకు మాత్రం క్లోం పడలేదు. జిల్లాలోని పలువురి ఇసుక అవసరం లేని వ్యక్తుల ఆధార్‌కార్డ్‌లను స్టాక్ పాయింట్‌ల వద్ద సమర్పించి ఇసుకను తరలించినట్టు తెలుస్తోంది. అలా సోమవారం తరలించిన ఇసుకను తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన అశ్వారావుపేటలో అన్‌లోడింగ్ చేసినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రెండు లారీలను సీజ్ చేసి విచారణ చేపట్టినట్టు చెబుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీ ఏ మేరకు పారదర్శకంగా సాగుతుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

14,383 టన్నుల ఇసుక సరఫరా

ఏలూరు (మెట్రో): జిల్లాలో ఇప్పటివరకు 14,383 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేసినట్లు మైనింగ్ డీడీ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 3 బుకింగ్ సెంటర్ల ద్వారా 2,570 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేశామన్నారు. ఈ బుకింగ్ సెంటర్లలో 141 ఆర్డర్లు నమోదు కాగా, అన్నింటికీ ఇసుక సరఫరా చేశామని, 124 లారీలు, 16 ట్రాక్టర్లు, ఒక 6 టైర్ల లారీ ద్వారా ఇసుక సరఫరా చేశామన్నారు.

'గ్రంథాలయం' నిర్మాణానికి ప్రతిపాదనలివ్వండి

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి సమగ్ర అంచనాలతో పరిపాలనా అమోదం కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులను జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సెస్సు కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉన్నందున వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.20 కోట్లు, గ్రంథాలయ సెస్సు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థకు బకాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో స్థానిక సంస్థల బకాయిలు రూ.20 కోట్ల నుంచి వెంటనే 10 శాతం చెల్లించేందుకు, స్థానిక సంస్థలు నిర్ణయించే ఆస్తి లేక ఇంటిపన్నుపై 8 శాతం చొప్పున గ్రంథాలయ సెస్సు డిమాండ్‌కు సంబంధించిన వివరాలు కూడా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని వైటీసీ భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్ బాబును ఆదేశించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ సిబ్బంది నిజాయతీ

పెళ్లి వారు మరిచిపోయిన బంగారు ఆభరణాలు తిరిగి అందజేత



రాజశేఖర్‌కు బంగారపు వస్తువులను అందజేస్తున్న గుమస్తా

ద్వారకాతిరుమల: ఓ పెళ్లి బృందం దేవస్థానం సత్రం గదిలో మరచిపోయిన బంగారు వస్తువులు.. ఆలయ సిబ్బంది నిజాయతీ కారణంగా తిరిగి వారికి దక్కాయి. ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంటకు చెందిన రాజశేఖర్ కుమారుడి వివాహం ఈ నెల 23న ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో జరిగింది. పెళ్లివారు కొండపైన ధర్మఅప్పారాయ నిలయం (120 గదులు) సత్రంలో రూములు అద్దెకు తీసుకుని ఉన్నారు. వివాహం అనంతరం ఒక గదిలో వజ్రాలు పొదిగిన బంగారపు నల్లపూసల గొలుసు, బంగారపు ఉంగరం, బంగారపు చెవి దిద్దెలను మరచిపోయి వెళ్లిపోయారు. అక్కడ పనిచేసే సిబ్బంది వాటిని ఆలయాధికారులకు అందించగా, వారు పెళ్లి వారికి సమాచారమిచ్చారు. మంగళవారం సత్రం వద్దకు వచ్చిన రాజశేఖర్‌కు అక్కడి గుమస్తా కొప్పిశెట్టి సాయి బంగారపు వస్తువులను అందజేశారు. ఆలయ సిబ్బంది నిజాయతీని పలువురు అభినందించారు.

గంజాయి స్వాధీనం

పెనుగొండ: పెనుగొండ వ్యవసాయ మార్కెట్ వద్ద మూడున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పెనుగొండ సీఐ నక్క రజిని కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతం నుంచి గంజాయిని పెనుగొండకు తరలిస్తుండగా ఏఎంసీ వద్ద వీరిని పట్టుకున్నట్లు వివరించారు. ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా బడఫదర్ గ్రామానికి చెందిన సానియా హంతులు, పెనుగొండకు చెందిన వాస్తవం దుర్గయ్య, పాలపర్తి చిన్ని వద్ద వీటిని స్వాధీనం చేసుకుని వారిపై తహసీల్దార్ జి అనితకుమారి, వీఆర్వోల సమక్షంలో కేసు నమోదు చేశామన్నారు సమావేశంలో ఎస్సై గంగాధర్ పాల్గొన్నారు.

బాధిత దళిత నేతకు పరామర్శ

దెందులూరు: ముండూరు గ్రామంలో టీడీపీ నేత చేతిలో దాడికి గురై చికిత్స పొందుతున్న సీనియర్ వైఎస్సార్ సీపీ దళిత నేత రాచూరి బాలస్వామిని మంగళవారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు పరామర్శించారు. ఘటనా వివరాలు అడిగి తెలుసుకుని దాడిని ఖండించారు. టీడీపీ నేత చేసిన దాడిని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ మాదిగ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ధైర్యంగా ఉండాలని, ఎంఆర్‌పీఎస్ అండగా ఉంటుందన్నారు.



కఠిన చట్టాలు అవసరం



ఆగిరిపల్లి: మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించే వారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలి. ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రాణాలు పోస్తున్న డాక్టర్లకే ప్రాణరక్షణ లేకపోవడం చాలా దారుణం. వైద్యుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మంజులాదేవి, ఆగిరిపల్లి మండలం, నగ్గూరు పీహెచ్‌సీ

ఆసుపత్రుల్లో రక్షణ ఏర్పాట్లు చేయాలి



మొగల్తూరు: గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు అనే కాకుండా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లోను డాక్టర్లకు, వైద్య సిబ్బందికి రక్షణ ఏర్పాట్లు చేయాలి. ఆసుపత్రుల్లో రోగి తరపు బంధువులం అంటూ రకరకాల వారు వస్తుంటారని, వైద్య సిబ్బందికి సరైన రక్షణ లేకపోతే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ సీహెచ్ సుధాకర్, కాళీపట్నం

హత్యాచారాలపై ఆగ్రహ జ్వాల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల విద్యార్థినులు మంగళవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ. శ్యామల రాణి, డెంటల్ కాలేజ్ విద్యార్థిని వీ అంబిక మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులను నిరోధించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ సమాజంలో ప్రతిరోజు ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉండడం దురదృష్టకరమన్నారు. ఏలూరులో గత ఆరు నెలల్లో ఆరుగురిపై హత్య, అత్యాచార ఘటనలు వెలుగు చూశాయన్నారు. అత్యాచారాలు అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేసి దోషులకు వెంటనే కఠిన శిక్షలు పడేలా చూడాలని, నిర్భయ ఉదంతం సందర్భంగా జస్టిస్ వర్మ కమిషన్ చేసిన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల రక్షణకు తక్షణం సెక్యూరిటీని ఏర్పాటు చేయాలన్నారు. తొలుత ఈ ర్యాలీ సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల నుంచి ప్రారంభమై అమీనాపేట పోలీస్ కళ్యాణ మండపం, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద భారీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్ సెంటర్లో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలపై విద్యార్థులు ప్రత్యేకంగా లఘు నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జీ మోజెస్, ప్రిన్సిపాల్ స్లీవ రాజు, సెయింట్ థెరిస్సా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ సుశీల, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పీ హైమావతి, డీవైఎఫ్ఐ నాయకులు పీ దుర్గాప్రసాద్, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో విద్యార్థుల మానవహారం



దోషులను ఇలా శిక్షించాలంటూ.. లఘు నాటిక ప్రదర్శన



ఏలూరులో విద్యార్థుల ర్యాలీ

ఇన్సూరెన్స్ కంపెనీని మోసగించిన ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులతో కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్ వద్ద వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

కైకలూరు: మోసానికి కాదేది అనర్హం అన్నట్లుగా ఫోర్జరీ ఇన్సూరెన్స్ పాలసీలకీ సైతం కేటుగాళ్లు పాల్పడుతున్నారు. ఇటువంటి కేసును కైకలూరు పోలీసులు మంగళవారం చేధించారు. టౌన్ స్టేషన్‌లో సీఐ పి.కృష్ణ కేసు వివరాలు వెల్లడించారు. కైకలూరు ప్రాంతంలో 5 నెలల క్రితం కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన ఘంటసాల మోహనకృష్ణ(27) తన బొలెరో వాహనంతో ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టగా అతడు మరణించాడు. దీనిపై కేసు నమోదయ్యింది. అయితే మోహనకృష్ణ తన వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఏలూరు ట్రాన్స్‌ఫారం వీధికి చెందిన మమిల్లపల్లి అంజనీకుమార్(39)తో కలిసి ఇన్సూరెన్స్ కోసం నకిలీ పత్రాలను తయారు చేయించారు. అకో జనరల్ ఇన్సూరెన్స్ ప్రైవేటు రంగ సాధారణ బీమా సంస్థకు చెందిన ఇన్సూరెన్స్ యాప్‌లో సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేశారు. అయితే బొలేరో వాహనానికి బదులు అల్ట్రో మారుతీగా మార్పు చేశారు. చివరకు అది నకిలీ అని తేలింది. బాధిత కుటుంబం పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించింది. బీమా సంస్థ నిర్వాహకులు కూడా జరిగిన మోసాన్ని గ్రహించి ఈ నెల 24న కైకలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బృందాలతో విచారణ చేపట్టి మోసగాళ్లను పట్టుకున్నామని సీఐ తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లతో అకో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, పోలీస్, ఆర్‌టీవో, ఎంవీఐలను తప్పుదోవ పట్టించినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీస్, ఆర్టీఏ అధికారులు వాహనాలు చెకింగ్ చేసేటప్పుడు సదరు తప్పుడు డాక్యుమెంట్‌నే ఒరిజినల్ డాక్యుమెంట్‌గా చూపిస్తూ, తక్కువ డబ్బుతో ఎక్కువ డబ్బు గల పాలసీని తయారు చేసి మోసాలు చేసినట్లు గుర్తించామన్నారు. చీటింగ్ కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. మరో వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ఆర్.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీని దొంగిలించబోయి..



ద్వారకానగర్‌లో స్తంభానికి కట్టివేసి ఉన్న దొంగ

ద్వారకాతిరుమల: స్కూటీని దొంగిలించబోయిన ఓ వ్యక్తి ఆ ఇంటి సభ్యుల కంట పడడంతో అతడిని స్తంభానికి కట్టేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం ప్రకారం. ద్వారకానగర్‌కు చెందిన గాంచి తానారామ్ ఇంటికి సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక దొంగ వచ్చాడు. ఇంటి ఆవరణలోని స్కూటీని దొంగిలిస్తుండగా తానారామ్ కుమారుడు సంజు, మేనల్లుడు రాజేష్ అతడిని పట్టుకున్నారు. చుట్టుపక్కల వారంతా కలిసి దొంగను స్తంభానికి కట్టేసి, పోలీసులకు సమాచారం అందించారు. తొలుత భీమడోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఘటన జరిగిన ప్రదేశం ద్వారకాతిరుమల మండల పరిధిలోనిది కావడంతో దొంగను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి, ఇతర అధికారులు

ఉంగుటూరు: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ముందస్తుగా అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా జాయంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అన్నారు. నారాయణపురంలో సొసైటీని, నాచుగుంటలోని గాయత్రి ట్రేడర్స్ రైసు మిల్లు, నారాయణపురం రైతు సేవా కేంద్రాన్ని జేసీ మంగళవారం పరిశీలించారు. గాయత్రి రైస్ మిల్లు స్టోరేజీ కెపాసిటీ, తేమ శాతం కొలిచే యంత్రాలను, బ్లెండింగు మెషీన్ పని తీరు, గోనె సంచుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రైసు మిల్లుల్లో 70 వేల గోనె సంచులు అందుబాటులో ఉండగా వాటిన్నింటిని ధాన్యం కొనుగోలుకు అనువుగా ఉండేలా చూడాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారంటీ సిద్ధం చేసుకోవాలని రైసు మిల్లు యాజమన్యానికి జేసీ సూచించారు. నారాయణపురం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా అక్కడ ఉన్న రైతులతో ధాన్యం కొనుగోలు విషయంపై చర్చించారు. ముందుగా మినీ మిల్లర్లు తేమ శాతాన్ని పరిశీలించుకోవాలన్నారు. సొసైటీని పరిశీలించిన జేసీ ధాత్రి రెడ్డి కంప్యూటరీకరణ తీరును కూడా పరిశీలించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కార్యకలాపాలకు సంబంధించి సొసైటీ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యలయాన్ని కూడా ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీఎస్‌వో ఆర్ఎస్ఎస్ రాజు, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ మంజుభార్గవి, డీఎస్‌వో శ్రీనివాసు, ఏడీఏ ఉషారాణి, వ్యవసాయ శాఖ ఏడీఏ ఉషారాజకుమారి, తహసీల్దార్ సతీష్ ఉన్నారు.

లక్ష్మీ నరసింహుని పంచలోహ విగ్రహం చోరీ



పంచలోహ విగ్రహం (ఫైల్)



ఆలయ తలుపులను పరిశీలిస్తున్న దృశ్యం

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పంచలోహ విగ్రహం చోరీకి గురైంది. మంగళవారం సాయంత్రం కొండపై ఉన్న స్వయంభు లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేసేందుకు వెళ్లిన అర్చకుడు ఆలయ తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. ఆలయం లోపలికి వెళ్లి చూడగా వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహుని పంచలోహ విగ్రహం, స్వామివారి గంట చోరీకి గురయ్యాయని గుర్తించి ఆలయ ఈవో సురేష్ బాబుకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జిల్లా ఎస్పీ శివకిషోర్‌తో మాట్లాడారు. స్వామివారి పంచలోహ విగ్రహాన్ని త్వరగా తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై సురేంద్ర కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయ ఈవో సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని ఉండి రోడ్డులో రెండు కాలువల వద్ద మంగళవారం ఉదయం మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. సత్యవతి నగర్‌కు చెందిన జి.దేవి(33)గా గుర్తించినట్లు చెప్పారు. మతిస్థిమితం లేకపోవడంతో గతంలో కూడా ఆమె ఇంటి నుంచి పలుమార్లు బయటకు వెళ్లినా తిరిగి వచ్చేదని, అయితే 26వ తేదీన వెళ్లిన మృతురాలు తిరిగి ఇంటికి రాలేదని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఏఎస్సై మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూరు రోజుల ప్రణాళిక లక్ష్యసాధనే ధ్యేయం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ఏలూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): జిల్లాలోని అన్ని శాఖల అధికారులు 100 రోజుల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో 100 రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా శాఖల పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వారికి నిర్దేశించిన లక్ష్యాలను 100 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏలూరు జిల్లాను నూరు రోజుల ప్రణాళిక అమలులో ముందు స్థానంలో నిలిపేలా అధికారులు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు రూపొందించిన నివేదికలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, అటవీ శాఖాధికారులు రవిశంకర్, హిమశైలజ, డ్వామా పీడీ పి.రాము, డీఎంహెచ్ఓ డా.శర్మిష్ఠ, డీఈఓ అబ్రహం, జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్ పాషా, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఎంఐపీ పీడీ రవికుమార్, ఉద్యానవన శాఖాధికారి రామ్మోహన్, ఐసీడీఎస్ పద్మావతి, గృహనిర్మాణ శాఖాధికారి శ్రీనివాస్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

పురుగు మందుల పిచికారీ.. తస్మాత్ జాగ్రత్త



జాగ్రత్తలు పాటించకుండా దాళ్వా వరి పైరుపై పురుగు మందు పిచికారీ చేస్తున్న వ్యవసాయ కూలీ

చింతలపూడి: చీడ పీడల నివారణకు మెట్ట ప్రాంతంలోని రైతులు పురుగుమందులను పిచికారీ చేయడంలో బిజీగా ఉన్నారు. పంటలను చీడ, పీడల నుండి రక్షించుకునే ప్రయత్నంలో రైతులు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. పురుగుమందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినట్లయితే ఒక్కోసారి ప్రాణాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగుమందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వ్యవసాయ సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. మూడు రకాలుగా పురుగుమందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందన్నారు.

చర్మం ద్వారా..

పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోనికి ప్రవేశించే ప్రమాదం ఉంది. ఒంటిపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

ముక్కు ద్వారా..

క్రిమిసంహారక మందుల ద్వారా వెలువడే వాయువులు పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తుంటే ముక్కు కేన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉంది.

నోటి ద్వారా..

పురుగుమందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మందు ప్రభావం ఎక్కువయ్యి విషమించి మరణం కూడా సంభవిస్తుంది.

చికిత్స ఇలా..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒక వేళ కళ్లల్లో పడినా మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుణ్ణి సంప్రదించాలి. ముక్కుతో కనుక పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. క్రిమి సంహారక మందు నోటిద్వారా కడుపులోకి వెళితే వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసుడు నీళ్లల్లో ఉప్పు లేదా ఆవాల పొడిని తగిన మోతాదులో కలిపి తాగించాలి. కడుపు ఖాళీ అయ్యే వరకు ఇలా తాగిస్తూ ఉండాలి. వెంటనే వైద్యుణ్ణి సంప్రదిస్తే తగిన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. క్రిమి సంహారక మందు పిచికారీ సమయంలో శరీరంపై నిండా దుస్తులు ధరించి, ముక్కుకు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేయడం మంచిది.



బి నాగకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ సబ్‌డివిజన్

ఉత్సాహంగా ఆటల పోటీలు



స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న దృశ్యం

ఏలూరు రూరల్: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆటల పోటీలు నిర్వహించింది. మంగళవారం ఉదయం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన షాట్‌పుట్, రన్నింగ్ పోటీల్లో మహిళలు సాయ్ సెంటర్ క్రీడాకారులు పాల్గొన్నారు. స్థానిక భిశ్వనాధ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో బాలబాలికలకు కోచ్ గణేష్ స్విమ్మింగ్ పోటీలు చేపట్టారు. ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో పీడీలు కె మురళీకృష్ణ, గవ్వ శ్రీనివాస్ బాస్కెట్‌బాల్ పోటీలు, ఇండోర్ స్టేడియంలో పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. బుధవారం సైతం ఇండోర్ స్టేడియంలో రెవెన్యూ, మునిసిపల్, ఆరోగ్య తదితర శాఖల ఉద్యోగులకు పోటీలు చేపడతామని డీఎస్‌డీఓ బి శ్రీనివాస్ చెప్పారు. 27, 28 తేదీల్లో పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.